క్లుప్తంగా

చెత్త సేకరణ డొక్కులు పంపిణీ



డొక్కులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సంజీవ రావు

కోటబొమ్మాళి: మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలో చెత్తను వేసుకునేందుకు ఒక్కో ఇంటికి రెండేసి డొక్కులను సర్పంచ్ కాల్ల సంజీవరావు ఆదివారం పంపిణీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి ఇంటికి వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపాన బాలకృష్ణ, వలంటీరు గణేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమతాసైనిక్ దళ్ సభ్యులు

టెక్కలి: భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సమతా సైనిక్ దళ్ ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు కోరారు. రాజ్యాంగ పరిరక్షణపై టెక్కలిలో అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్క పౌరుడు కృషి చేయాలన్నారు. ఐక్య పోరాటాలతో హక్కులను సాధించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధులు చల్లా రామారావు, అశోక్ అంబేడ్కర్, శ్రీనివాసరావు, డి.రామప్పడు, పి.చంటి, పి.నాగేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

108 సేవలను విస్తృతం చేయండి



శిక్షణలో పాల్గొన్న 108 వాహనాల పలాస డివిజన్ సిబ్బంది

కాశీబుగ్గ: ప్రజలకు 108 వాహన సేవలు సక్రమంగా అందించాలని జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ నజీర్ అన్నారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పలాస డివిజన్ ఓఈ హరిప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన శిక్షణలో నజీర్ మాట్లాడుతూ 108 వాహన సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. 12 సంవత్సరాల్లోపు పిల్లల ఆరోగ్య సమస్యలు.. వాటి నివారణ తెలుసుకోవాలని సూచించారు. ఆపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేసే విధానం, ట్రోమ ఎమర్జన్సీస్, ఎయిర్‌వే మేనేజ్మెంట్, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు.

చిన్నారుల అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వండి

● ఆర్‌పీఎఫ్ ఎస్సై మలయాద్రి



మాట్లాడుతున్న ఎస్సై మలయాద్రి

కాశీబుగ్గ: చిన్నారుల అక్రమ రవాణా జరుగుతున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పలాస ఆర్‌పీఎఫ్ ఎస్సై మలయాద్రి కోరారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా పలాస రైల్వేస్టేషన్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానికంగా ర్యాలీ చేపట్టారు. పలు రైళ్లలో మానవ అక్రమ రవాణాపై తనిఖీలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మలయాద్రి మాట్లాడుతూ.. ఎవరైనా పిల్లలు ట్రైన్‌లో గాని రైల్వే ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా సంచరిస్తే 1098కు ఉచిత కాల్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో నడపబడుతున్న చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది జనపాన భాగ్యారెడ్డి, శివాజీ, సునీత, జాస్మిత, బాలసరస్వతి, బేటీపడావో స్టేట్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, కో-ఆర్డినేటర్ సింహాచలం, జీఆర్పీ హెచ్‌సీ రమేష్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు క్లబ్ మాజీ అధ్యక్షుడు మాటూరి నవీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి అధ్యక్షుడుగా సప్పటి రోహిత్, కార్యదర్శిగా మాచర్ల రాజ్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్‌గా పైడిశెట్టి దినేష్‌కుమార్‌లు ఎన్నికైనట్టు పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

తీరిన వంతెన కష్టాలు



డైవర్షన్ రోడ్డులో రాకపోకలు చేస్తున్న దృశ్యం



నేడు: కొత్తగా నిర్మించిన వంతెన

జాతీయ రహదారి నుంచి నందిగాం మీదుగా పూండి వరకు ఉన్న రోడ్డులో కణితూరు వద్ద గతంలో వంతెన లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడేవారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఓ ప్రమాదంతో వంతెన పూర్తిగా కూలిపోయింది. దీంతో పక్క నుంచి తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు వేయడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు. అయితే వర్షాకాలంలో ఆ మార్గంలో రాకపోకలకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈ సమస్యను విన్నవించగా.. వంతెన నిర్మాణానికి సుమారు రూ.1.58 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఈ నిధులతో కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంతీయులు సంతోషంగా రాకపోకలు సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో వంతెన పరిస్థితి.. ప్రస్తుత ప్రభుత్వంలో వంతెన పరిస్థితి చూస్తే సంక్షేమ పాలన ఇట్టే అర్థమవుతుంది. – టెక్కలి

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



కిట్లను అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 35 మంది గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను ఆదివారం అందజేశారు. రోటరీ కార్యాలయంలో అధ్యక్షుడు దుద్ది శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా గర్భిణులకు ఆరోగ్యంపై ప్రముఖ వైద్యులతో అవగాహన కల్పించారు. వైద్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ, మంచు ప్రదీప్, పెద్దిటి దుర్యోధన, శ్రీలక్ష్మిలు గర్భిణలు తీసుకోవాల్సిన ఆహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పి.వి.కృష్ణారావు, రవికుమార్, టి.బాబు, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నర్తుకు పౌర సన్మానం



ఎమ్మెల్సీ రామారావు దంపతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న శావసానపుట్టుగ గ్రామస్తులు

కవిటి: శావశానపుట్టుగ గ్రామస్తులు ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులను ఆదివారం ఘనంగా పౌర సన్మానం చేశారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలి సారిగా గ్రామానికి వచ్చిన నేపథ్యంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానికులు ఘనంగా స్వాగతం పలికి ఊరేగించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. తనపట్ల ఇంత అభిమానం చూపిన శావసానపుట్టుగ గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తానన్నారు. అనంతరం గ్రామపెద్దలు రామారావు, చామంతి దంపతులకు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై దృష్టిసారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘ ప్రతినిధులు

సోంపేట: రైతుల సమస్యలపై అధికారులు దృష్టిసారించాలని రైతు కుల సంఘ నాయకులు కోరారు. కొర్లాం గ్రామంలో సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందజేయాలన్నారు. ఉద్యాన పంటలకు రాయితీపై విత్తనాలు సరఫరా చేయాలన్నారు. సాగునీటిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రతినిధులు జె..వి.వి.ప్రసాదరావు, బుద్దాన శ్రీకృష్ణ, వెదుల్ల మాధవరావు, మర్ల శంకరరావు, రాంబుడ్డి గణపతి, మద్దిలి నాగేశ్వరరావు, బోందాళం మదన్ మోహన్ పాల్గొనారు.

ధర్మకోనేరు అభివృద్ధికి సహకరించాలని వినతి



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లీరావు తదితరులు

వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామంలో ధర్మ కోనేరుకు రహదారి నిర్మాణం, అభివృద్ధి పనులకు సహకరించాలని సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన గ్రామంలోని రైతులతో కలిసి నువ్వలరేవులో మంత్రి సీదిరి అప్పలరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ధర్మకోనేరు చాలా ఏళ్లుగా రహదారి సౌకర్యం లేదన్నారు. దీంతో అవసర సమయాల్లో స్థానికులు ఇబ్బంది పడతున్నారన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనాలకు, గ్రామంలో ఉత్సవాలు, దహన సంస్కారాల సమయంలో స్నానాలకు మూడు కిలోమీటర్ల దూరంలోని బెండి గెడ్డకు వెళ్లాల్సి వస్తోందని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసినవారిలో టి.బాలకృష్ణ, టి.వాసులు, బి.బొడ్డెయ్య, టి.దుర్యోధనరావు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి సత్యసాయి బోధనలు దోహదం

● ఏఎస్పీ విఠలేశ్వరరావు



మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

కవిటి: సత్యసాయి బోధనలు వ్యక్తిత్వ వికాసానికి సోపానాలుగా నిలుస్తాయని ఏఎస్పీ పి.విఠలేశ్వరరావు అన్నారు. ఆదివారం 12 గంటల సత్యసాయి దివ్య నామ సంకీర్తన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ముందుగా వేకువ జామున నాలుగు గంటల నుంచి సాయిగాయిత్రీ, సుప్రభాతం, నగర సంకీర్తనతో ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. అనంతరం జరిగిన సభలో విఠలేశ్వరరావు యువత, సత్యసాయి భక్తులనుద్దేశించి చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగం శ్రోతల ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట, ఒడిశాలోని పలు గ్రామాలకు చెందిన సత్యసాయి భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మీటర్ రీడర్లు

కాశీబుగ్గ: గత పదిహేనేళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్లు కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రతినెల జీతాలు చెల్లించాలని, కుదించిన పదిదినాలను ఉపసంహరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మీటర్ రీడర్లసంఘ అధ్యక్షుడు ఆర్.కుమారస్వామి, టెక్కలి, పలాస డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖరరావు, కోశాధికారి ఎస్.అఖిల్, సభ్యులు బి.ఓంకార్, ఎస్.బలరాం, జి.తేజేశ్వరరావు, ఎస్.సురేష్ ఉన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

ఇచ్ఛాపురం: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో అభివృద్ధిపై చర్చిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం



నేతింటి కృష్ణమూర్తి (ఫైల్)

కోటబొమ్మాళి: కోటబొమ్మాళికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతింటి కృష్ణమూర్తి (75) అనారోగ్యంతో ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. ఈయన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం రాజకీయకీయాల్లోకి వచ్చి మంత్రి ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్‌ల ఆశీస్సులతో రాణించారు. కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్‌గా నాలుగేళ్లు సేవలందించారు. కోటబొమ్మాళి మండల రాజకీయల్లో క్రియాశీలంగా వ్యవహరించారు. మృతదేహాన్ని కోటబొమ్మాళికి తీసుకొచ్చి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. కృష్ణమూర్తి మృతికి వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, కోటబొమ్మాళి, చీపుర్లపాడు సర్పంచ్‌లు కాల్ల సంజీవరావు, నేతింటి అప్పలస్వామి, పార్టీ నాయకులు బొడ్డు అప్పన్న, సుకరి జనార్దన సంతాపం తెలియజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం మూడున్నర గంటలకు జరుగుతోందని ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పైల చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం నిర్వహించాల్సిన సమావేశం అనివార్య కారణాలతో సోమవారానికి వాయిదా పడిందన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.


ముమ్మరంగా జీడి తోట పనులు



తోట పనులు చేస్తున్న కూలీలు

పలాస: ఉద్దానం ప్రాంతంలోని జీడి రైతులు తమ తోటల్లో తోట మలుపు పనులు చేయిస్తున్నారు. మే నెలాఖరులో తోటల్లో జీడిపిక్కల ఏరివేత పూర్తి చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తోటను శుభ్రం చేయించుకుంటున్నారు. పనులకు రోజుకు ఒక్కో కూలీకి రూ.500 చెల్లిస్తున్నట్టు తోటల యజమానులు చెబుతున్నారు.

పొల్లాడ-దబ్బలపాడు రోడ్డు పనులు ప్రారంభం



దబ్బలపాడు వద్ద పనులు జరుగుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పొల్లాడ నుంచి దబ్బలపాడు వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులు ప్రారంభమయ్యాయి. 1.4 కిలోమీటర్ల రహదారికి ఏబీబీ-1బీ నిధులు రూ. 34.50 లక్షలు మంజూరైనట్టు పీఆర్ డీఈఈ జి.రవిబాబు తెలిపారు. రహదారి పూర్తయితే అటు టెక్కలి ఇటు పలాస నియోజకవర్గం ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని సైలాడ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు పి.జయరాం, పొల్లాడ సర్పంచ్ అట్టాడ గోవిందరావు అన్నారు.

హామీలన్నీ అమలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి సీదిరి అప్పలరాజు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

- సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం
- నువ్వలరేవులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు రూరల్: ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. జగన్‌తోనే సంక్షేమం సాధ్యమని చెప్పారు. నువ్వలరేవు గ్రామంలో సర్పంచ్ మువ్వల యజ్ఞా, ఉప సర్పంచ్ మువ్వల దేవా ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రజాసంక్షేమాన్ని పక్కన పెట్టి జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్ర సంపదను లూటీ చేశారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారం కోసం మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారని.. వీటిని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు మంగళం పాడడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమం పాలనకు ప్రజాదరణ పెరగడంతో ఓర్వలేక చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కలిసి విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులను బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రికి రెండు కళ్లలాంటివన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. ప్రధానంగా మత్స్యకారుల జీవనప్రమాణాలు మెరుగు పరిచేందుకు అనేక పథకాలతో పాటు ఫిషింగ్ హార్బర్, జట్టీల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. నువ్వలరేవు గ్రామంలోనే జట్టీ బదులు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదన చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో సీఎం జగన్ చేతుల మీదగా పలాస వేదికగా శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు దొర, నర్తు ప్రేమ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు, మాజీ సర్పంచ్ రఘు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బెహరా నీలాంబర్, ఎంపీటీసీ సభ్యుడు బైనపల్లి రామక్రిష్ణ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో 25 కుటుంబాలు చేరిక: కొత్తపేట గ్రామానికి చెందిన 25 టీడీపీ కుటుంబాలు మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కొత్తపేట గ్రామంలో ఆదివారం మత్స్యకార సొసైటీ అధ్యక్ష ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన గీత బాలరాజుతో పాటు మరికొంత మంది నువ్వలరేవు వేదికగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులమై ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు మాకయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



ఈశ్వరికి నగదు అందజేస్తున్న దృశ్యం

మందస: మూలిపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని తెలుకుల ఈశ్వరి సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతూ ట్రిపుల్ ఐటీ సీటు సంపాదించింది. ఈశ్వరి టెన్త్‌లో 563 మార్కులు సాధించింది. ఈమెది నిరుపేద కుటుంబం కావడంతో తెలుకుల జిల్లా సంఘం, మందస సంఘం సభ్యులు ఐదు వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమెకు ఆదివారం అందజేశారు. కాగా ఈశ్వరి సోదరి త్రివేణి కూడా ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడంతో ఆమెను సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తెలుకుల గణేశ్, మన్మథరావు, పొందు, డొంబురు, సురేష్, సంతోష్, చక్రపాణి పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం



నరసింహమూర్తికి సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కంచిలి: చిన్నశ్రీరాంపురం గ్రామానికి చెందిన మార్పు నరసింహమూర్తికి బ్రెయిన్‌డెడ్ అయి మేజర్ సర్జరీ జరిగింది. ఆర్థికంగా చితికిపోయిన ఈ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉద్దానానికి చెందిన ఏపీజే అబ్దుల్‌కలాం ఫౌండేషన్ సభ్యులు ముందుకొచ్చారు. పది వేల రూపాయలు సేకరించి.. ఈ మొత్తాన్ని చిన్నశ్రీరాంపురం గ్రామానికి ఆదివారం వెళ్లి నరసింహమూర్తికి అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులతోపాటు గ్రామస్తులు మాదిన చిరంజీవి, మార్పు కేదారి, అమరనాథ్, సీతారాం, టి.బృందావన్, జి.వసంత్ పాల్గొన్నారు.

విద్యార్థికి చింతామణి ట్రస్టు చేయూత



కోదండరావుకు సాయాన్ని అందజేస్తున్నదృశ్యం

కవిటి: విద్యార్థికి చింతామణి ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు. 'సాయం కోసం సరస్వతీ పుత్రుడు' శీర్షికన 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికిపై హైదరాబాద్‌కు చెందిన చింతామణి ట్రస్టు స్పందించింది. కొత్తపాలెం గ్రామానికి చెందిన గంటా కోదండరావు జేఈఈ ప్రవేశ పరీక్షల్లో 16016 ర్యాంక్ సాధించి బీహార్‌లోని పాట్నా ఐఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించాడు. నిరుపేద కావడంతో అండగా ఉంటామని చింతామణి ట్రస్టు సభ్యులు హామీ ఇచ్చారు. తొలివిడత సాయంగా రూ.20 వేల సాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని కవిటి చింతామణి ఆలయం ఆవరణలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కోదండరావుకు ఆదివారం అందజేశారు. చదువు కొనసాగే నాలుగేళ్లు చింతామణి ట్రస్టు అధినేతలు ఇందిరాదేవి, మణికుమార్ కోదండరావుకు సహకారం ఇచ్చేందుకు సంసిద్ధతను తెలిపారని కోఆప్షన్ సభ్యుడు చంద్రశేఖర్ తెలిపారు. ప్రతినిధులు బి.రమణ, జన్ని లోకనాథం, ఆరంగి మధుబాబు, ఉమా, దశరధ పాల్గొన్నారు.